

ప్రజా న్యూస్

— నెట్‌వర్క్ —

నిజం.. సమాజం.. ప్రజా కోసం.. || తెలుగు దినపత్రిక ||



తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 183,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, పెల : 02,శుక్రవారం, తేదీ : 06-11-2026

ధైర్యం ఉంటే ప్రధానికి అధికారికంగా లేఖ రాయండి'

రాహుల్‌కు అమిత్ షా కౌంటర్

- రాహుల్ గాంధీపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా విరుచుకుపడ్డారు.
- చిత్తశుద్ధి ఉంటే ప్రధానికి అధికారికంగా లేఖ రాయాలని సూచించారు.



ఢిల్లి : ఎస్ఐఆర్, ఈవీఎంల వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ చర్చకు రావాలంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విసిరిన సవాల్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. రాహుల్‌కు నిజంగానే చర్చించాలనే చిత్తశుద్ధి, ధైర్యం ఉంటే ప్రధానమంత్రికి అధికారికంగా లేఖ రాయాలని సూచించారు. ఎస్ఐఆర్, ఈవీఎంలు, చొరబాటుదారుల అంశాలపై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. హరియాణాలోని కర్నాల్‌లో బీజేపీ నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో, అరాజకత హఠావో' యాత్రలో అమిత్ షా ప్రసంగించారు. పార్లమెంట్‌ను సజావుగా నడవనివ్వకుండా బయట రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరిగితే సరిపోదని, ప్రవర్తన కూడా రాజ్యాంగబద్ధంగా ఉండాలని రాహుల్ గాంధీకి హితవు పలికారు. పార్లమెంట్‌లో చర్చలకు సహకరించకుండా వాకౌట్లు చేయడం, ఆందోళనలకు దిగడం కాంగ్రెస్ సంస్కృతిగా మారిందని విమర్శించారు. మృతుల పేర్లతో పాటు మూడు కోట్ల మంది బంగ్లాదేశ్ చొరబాటుదారులు, రోహింగ్యాల బోగస్ ఓట్లను ఎన్నికల సంఘం తొలగిస్తుంటే రాహుల్ గాంధీకి ఎందుకు అభ్యంతరమని ప్రశ్నించారు. చొరబాటుదారులే మిగతా..2లో

దిల్లీ నిరసనలపై సుప్రీం కీలక వ్యాఖ్యలు- నెలరోజుల్లోగా నివేదికను మర్పించాలని



- ★ దిల్లీ నిరసనలపై దర్యాప్తు చేస్తున్న ఉన్నతస్థాయి కమిటీకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది.
- ★ నెలరోజుల్లోగా ప్రాథమిక వాస్తవ నిర్ధరణ నివేదికను సమర్పించాలని కోరింది.

దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతృత్వంలో జరిగిన నిరసనల సమయంలో పోలీసుల బలప్రయోగంపై విచారణ జరుపుతున్న ఉన్నత స్థాయి కమిటీ (హెచ్‌పీసీ)కి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది.

అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది

ఇటీవల కొల్హాపుర్ లో జరిగిన గోకుల్ మిల్క్ కోఆపరేటివ్ ఎన్నికల్లో తీర్పును తారుమారు చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది.



ఢిల్లి :మహారాష్ట్రలోని మహాయుతి కూటమిపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఇటీవల కొల్హాపుర్ లో జరిగిన గోకుల్ డెయిరీ కోఆపరేటివ్ ఎన్నికల్లో ప్రజా తీర్పును తారుమారు చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించింది. డైరెక్టర్ల బోర్డులో మెజారిటీని దక్కించుకోవడానికి ఎన్నికల తర్వాత నిబంధనలను మార్చిందని దుయ్యబట్టారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం తన ఎక్స్ ఖాతాలో పోస్టు పెట్టారు. "గోకుల్ డెయిరీ ఎన్నికల్లో పాడి రైతులు బీజేపీ కూటమిని ఓడించారు. అందుకే ఎన్నికల తర్వాత బీజేపీ నిబంధనలను మార్చింది. ఇందుకోసం బోర్డులో నలుగురు డైరెక్టర్లను నియమించి 12 మందిని 16 మందిగా మార్చి మెజారిటీని దొంగలించింది. ఇది ముమ్మాటికి పాల ఉత్పత్తిదారుల ఓట్లను దొంగలించడమే. తీర్పును కల్తీ చేయడమే. అధికారాన్ని కాపాడుకోవడానికి బీజేపీ ఎంతకైనా తెగిస్తోంది. రైతుల ఓట్లను దొంగిలించే వారిని రైతాంగం ఎప్పటికీ మరచిపోదు." మరోవైపు, ఈ అంశంపై కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా చేసిన ఎక్స్ పోస్టు రాహుల్ గాంధీ ట్యాగ్ చేశారు. అందులో, ఒక ఎన్నిక ముగిసిన తర్వాత, ఫలితం నచ్చలేదనే కారణంతో ప్రభుత్వం నిబంధనలను ఎలా మారుస్తుందని ఖేడా ప్రశ్నించారు. ప్రతిపాదిత మార్పులపై ఆయన మహారాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్య వ్యతిరేక నిర్ణయాన్ని, సహకార సంస్థల స్వయంప్రతిపత్తిని కాపాడటానికి తాము సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నట్లు ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. మిగతా..2లో

ఆర్ఆర్ ట్యాక్స్' నిజమే అయితే చర్యలేవి మోదీ, షాలకు కేటీఆర్ ప్రశ్న



- ఆర్ఆర్ ట్యాక్స్‌పై కేటీఆర్ మరోసారి విమర్శలు
- చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారని ఆరోపణ
- బిల్డర్లు, డెవలపర్లకు విషయం తెలుసన్న కేటీఆర్
- విమర్శలు చేస్తున్న కేంద్రం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్న
- బీజేపీ-కాంగ్రెస్ మధ్య అవగాహన ఉందని ఆరోపణ

హైదరాబాదన్: తెలంగాణ రాజకీయాల్లో 'ఆర్ఆర్ ట్యాక్స్' వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు

7, 8, 9 తేదీల్లో సీఎం కొడంగల్ పర్యటన

- రూ.9,100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రైతు మేలా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో ప్రారంభం
- రైతులు, పారిశ్రామికవేత్తలు, ఎస్‌హెచ్‌జీ మహిళలతో సమావేశాలు



హైదరాబాద్, నవంబర్ 5 : ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈనెల 7, 8, 9 తేదీల్లో కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మెగా రైతు మేలా ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించడంతోపాటు రూ.9,100 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. పూర్తయిన భవనాల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు. 7వ తేదీ ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11 గంటలకు వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట చేరుకుంటారు. 11.10 గంటలకు అక్కడ మెగా రైతు మేలా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభిస్తారు. 12 గంటల వరకు ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శిస్తారు. ఒంటి గంట వరకు ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి సమావేశంలో పాల్గొంటారు. 2 గంటల వరకు పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతారు. 3 గంటలకు హకీంపేట నుంచి రోడ్డు మార్గంలో కొడంగల్ నివాసానికి బయలుదేరుతారు. రాత్రి కొడంగల్‌లో బస చేస్తారు. 8వ తేదీ ఉదయం 9.15 గంటలకు కొడంగల్ నివాసం నుంచి బయలుదేరి హకీంపేట చేరుకుంటారు. 9.30 నుంచి 10.20 గంటల వరకు స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. 10.20కు పలు అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. తర్వాత లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో మిగతా..2లో

అయ్యప్ప సొసైటీపై సర్వే చేయాలి రేవంత్ సర్కారుకు కవిత నెల రోజుల డెడ్‌లైన్



- అయ్యప్ప సొసైటీ అక్రమ కట్టడాలపై సర్వేకు కవిత డిమాండ్
- కాంగ్రెస్ వచ్చాక 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని ఆరోపణ
- సీఎం సోదరులే డబ్బులు దండుకుంటున్నారని వ్యాఖ్య

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని ఖానామెట్ అయ్యప్ప సొసైటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని టీఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఇందుకోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నెల రోజుల గడువు ఇస్తున్నామని, లేదంటే తమ పార్టీ కార్యకర్తలే అక్రమ కట్టడాలకు 'రెడ్ మార్క్' వేస్తారని హెచ్చరించారు. హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ మిగతా..2లో

సోషల్ మీడియాలో శ్రీవారి వైభవం - 54 రోజుల్లో 17 కోట్లకు పైగా వ్యూస్



కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వైభవం సామాజిక మాధ్యమాల వేదికగా ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది.
54 రోజుల్లో 17.54 కోట్ల మంది వీక్షించినట్లు టీటీడీ వెల్లడించింది.

తిరుపతి : "వెంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తికించన వేంకటేశ సమోదేవో నభూతో న భవిష్యతి" కలియుగంలో వేంకటాద్రిని మించిన పుణ్యధామం బ్రహ్మాండంలోనే లేదు. ఆపదలో ఉండి హరీ అని పిలవగానే కష్టాలను తొలగించే శ్రీనివాసుడిని మించిన దైవం ఇలలో లేదు. ఇకపై రాదని ప్రశస్తి. కలియుగాధిపతిగా శేషాచల నివాసిగా ఏడుకొండల వెంకన్నగా పూజలందుకుంటున్నారు. తిరుమల శ్రీవారి వైభవం, ఆధ్యాత్మిక విశేషాలకు సామాజిక మాధ్యమాల్లో విశేష ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వైభవం సామాజిక మాధ్యమాల వేదికగా ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది. మిగతా..2లో

తెలంగాణను అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



తెలంగాణను అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.
రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు.

హైదరాబాద్, నవంబరు 5 : తెలంగాణను అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఈరోజు (గురువారం) గచ్చిబౌలిలో తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ ఛాలెంజ్ 2026 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో అంతర్జాతీయ పోటీలు కొనసాగుతున్నాయి. నవంబరు 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మిగతా..2లో

సాయన్న పేరులోనే సాయముందిరా!".. పార్టీ సన్నాహక గీతం పంచుకున్న విజయసాయిరెడ్డి



- వైసీపీకి రాజీనామా చేసి, సొంత పార్టీ ఏర్పాటు చేస్తున్న విజయసాయిరెడ్డి
- నవంబరు 11న పార్టీ పేరు ప్రకటించనున్న వైనం
- సన్నాహక గీతంతో పార్టీ ఏర్పాటు ప్రక్రియ ముమ్మరం

అమరావతి : వైసీపీకి రాజీనామా చేసి సొంత రాజకీయ పార్టీ ఏర్పాటుకు సిద్ధమైన రాజ్యసభ మాజీ సభ్యుడు

తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రమంత్రి ప్రశంసలు..

మంత్రి సీతక్కకు శివరాజ్ సింగ్ చౌహాన్ లేఖ

వి.బిజీ రామ్ జీ అమల్లో తెలంగాణ ప్రభుత్వ కృషిని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసించారు.

రాష్ట్రంలోని దాదాపు అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు ప్రారంభించడంపై అభినందించారు.



ఢిల్లీ, నవంబరు 5 : వి.బిజీ రామ్ జీ అమల్లో తెలంగాణ ప్రభుత్వ కృషిని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసించారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు ప్రారంభించడంపై అభినందించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు (గురువారం) లేఖ రాశారు. 202627 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణకు రూ.3,825.3 కోట్ల నిధులను కేటాయించినట్లు వెల్లడించారు.

రాష్ట్రంలో 1.83 కోట్ల పనిదినాలను కల్పించాం..

తెలంగాణ ప్రతిపాదించిన గృహ నిర్మాణ పథకంతో పాటు పలు పనులకు అనుమతి ఇచ్చినట్లు శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు. వి.బిజీ రామ్ జీ కింద ఇప్పటివరకు రాష్ట్రంలో 1.83 కోట్ల పనిదినాలను కల్పించినట్లు ప్రస్తావించారు. కేంద్రమంత్రి లేఖలో తెలంగాణ ప్రభుత్వ కృషిపై ప్రశంసలు కురిపించారు. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పన, చట్ట నిబంధనల అమల్లో రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను కొనియాడారు. రాష్ట్రంలో పలు పనులను అమలు చేయడం, ప్రారంభించడంపై కేంద్రమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. మిగతా..2లో

ఏపీలో ముగిసిన జడ్పీటీసీ,

ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్..



- ★ చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా సాగిన ప్రక్రియ
- ★ ప్రాథమిక అంచనాల ప్రకారం 6568% పోలింగ్ నమోదు
- ★ నవంబర్ 7న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి
- ★ స్ట్రాంగ్ రూమ్‌లకు బ్యాలెట్ బాక్సుల తరలింపు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల సమరంలో కీలక ఘట్టమైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

94 శాతం స్ట్రైక్‌రేట్‌ను దాటాలి..
పరిషత్ ఎన్నికలకు సీఎం చంద్రబాబు కొత్త టార్గెట్

మున్సిపల్ ఎన్నికల్లో కూటమి 94 శాతం స్ట్రైక్ రేట్ సాధించిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. గత రెండున్నరేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు, సుపరిపాలనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని అన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, మనం ప్రజలకు అండగా నిలిస్తే వారూ మనకు తోడుంటారని పేర్కొన్నారు. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా నేడు పరిషత్ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. మొత్తం 7,770 ఎంపీటీసీ, 582 జెడ్పీటీసీ స్థానాలకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 7వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి నాదెండ్ల మనోహర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ నేత పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప సొసైటీపై సర్వే చేయాలి
రేవంత్ సర్కారుకు కవిత నెల రోజుల డెడ్‌లైన్

ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీలో సుమారు 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులే దగ్గరుండి పర్మిషన్లు ఇప్పించి డబ్బులు దండుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. భూములు, టీడీఆర్ అక్రమ దందాలు తప్ప సీఎం రేవంత్‌కు మరేమీ కనిపించడం లేదని ఆమె విమర్శించారు. ఈ వ్యవహారంలో సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అయ్యప్ప సొసైటీలో రిజిస్ట్రేషన్లు జరగవని, అక్కడ ఇళ్లు కొనుగోలు చేసి ప్రజలు నష్టపోవద్దని కవిత సూచించారు. గురుకుల ట్రస్ట్ భూములపై గతంలో తాము ఎన్నో ఉద్యమాలు చేశామని గుర్తుచేశారు. ఇదే సొసైటీలో నారాయణ, చైతన్య వంటి విద్యాసంస్థలు కూడా ఉన్నాయని ఆమె తెలిపారు. కేంద్ర మంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనపైనా కవిత స్పందిస్తూ, ఆయన కేవలం రాజకీయాలు మాట్లాడి వెళ్లారని, రాష్ట్రంలోని కరవు పరిస్థితులపై స్పందించలేదని విమర్శించారు.

ఏపీలో ముగిసిన జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్..

రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్, సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో వర్షం కారణంగా ఉదయం పోలింగ్ మందకొడిగా సాగినా, మధ్యాహ్నం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. చెదురుమదురు ఘర్షణలు, వాగ్వాదాలు మినహా పోలింగ్ ప్రక్రియ చాలా వరకు ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 58.55% పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. పోలింగ్ ముగిసే సమయానికి ఈ శాతం 65 నుంచి 68 శాతం మధ్య ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. రాయలసీమ, కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనగా, కొన్ని గిరిజన, తీర ప్రాంతాల్లో పోలింగ్ శాతం కాస్త తక్కువగా నమోదైనట్లు సమాచారం. ఈ ఎన్నికల బరిలో నిలిచిన సుమారు 21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు గాను 77 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. 9,821 ఎంపీటీసీ స్థానాలకు గాను 2,051 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఈరోజు పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగానే సాగినప్పటికీ, పల్నాడు, అనంతపురం, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదాలు, తోపులాటలు చోటుచేసుకున్నాయి. కొన్ని చోట్ల పెట్రోల్ బాంబులతో దాడులు జరిగాయి. కొన్ని చోట్ల ఇరువర్గాలు కర్రలు, రాళ్లతో దాడులకు దిగడంతో స్వల్প ఉద్రిక్తత నెలకొంది. అయితే, సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనల వల్ల పోలింగ్‌కు పెద్దగా అంతరాయం కలగలేదు. పోలింగ్ ముగిసిన వెంటనే అధికారులు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీళ్లు వేసి, కట్టుదిట్టమైన భద్రత నడుమ వాటిని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఏవైనా కేంద్రాల్లో తీవ్రమైన అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయితే, నవంబర్ 6న అక్కడ రీ-పోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 7వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను ప్రకటించనున్నారు. ఈ ఫలితాల ఆధారంగా నవంబర్ 11, 12 తేదీల్లో ఎంపీపీ అధ్యక్షులు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ల ఎన్నికలు జరగనున్నాయి. దీంతో స్థానిక ప్రజాప్రతినిధుల ఎన్నికల ప్రక్రియ పూర్తి కానుంది.

అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది

"అక్టోబర్ 19న జరిగిన గోకుల్ డెయిరీ (కొల్హాపూర్ జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల సంఘం) ఎన్నికల్లో మొత్తం 25 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అందులో కాంగ్రెస్ నాయకుడు సతేజ్ పాటిల్ నేతృత్వంలోని ప్యానెల్ 13 స్థానాలను గెలుచుకుని స్పష్టమైన మెజారిటీ దక్కించుకున్నారు. అధికార మహాయుతి (బీజేపీ కూటమి) ప్యానెల్ కేవలం 12 స్థానాలకే పరిమితమైంది. అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడి రోజులు గడుస్తున్నప్పటికీ, ఎన్నికల సమావేశాలకు అవసరమైన 14 మంది డైరెక్టర్ల కోరం లేకపోవడంతో దాని ఛైర్మన్ పదవి ఖాళీగా ఉంది. మహాయుతి మద్దతు ఉన్న డైరెక్టర్లు గైర్హాజరై ఛైర్మన్ ఎన్నికను అడ్డుకున్న తర్వాత, నవంబర్ 10న తిరిగి ఎన్నికలు నిర్వహించాలని బాంబే హైకోర్టు ఆదేశించింది." 'తీర్పును తారుమారు చేసే అవకాశం ఉంది' ఎన్నికైన బోర్డును సజావుగా పనిచేయనివ్వకుండా, మహారాష్ట్ర క్యాబినెట్ బుధవారం ఒక కొత్త ప్రతిపాదనకు ఆమోదం తెలిపిందని పవన్ ఖేడా ఆరోపించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకును మినహాయించి రూ. 500 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ ఉన్న సహకార సంస్థల మేనేజింగ్ కమిటీల్లో ఐదుగురు ప్రభుత్వ నామినేటెడ్ సభ్యులను నియమించాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఇందులో నలుగురు సభ్యులకు ఓటు వేసే హక్కును కూడా కల్పించిందని పేర్కొన్నారు. దీని ద్వారా ఎన్నికల లెక్కలను మార్చి, పాల ఉత్పత్తిదారుల తీర్పును తారుమారు చేసే అవకాశం ఉందని ఆయన ఆరోపించారు. ఇదిలా ఉండగా, సామాజిక సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు ఆధార్‌కు బదులుగా ఓటరు గుర్తింపు కార్డును ఉపయోగిస్తామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ స్పందించింది. 'ఓట్ల చోరీ' అనేది కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు కథ 'హక్కుల చోరీ' అని పేర్కొంది. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ మాట్లాడుతూ, ఇకపై తమ మంత్రిత్వ శాఖ పరిధిలోని సంక్షేమ పథకాలు, ఆర్థిక ప్రయోజనాలను పొందాలంటే, బయోమెట్రిక్ ధ్రువీకరణతో పాటు ఓటరు గుర్తింపు కార్డు నంబర్ కూడా తప్పనిసరి అని పేర్కొన్నట్లు సమాచారం. అయితే, గత కొన్ని రోజులుగా కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పలుమార్లు ఇలాగే చెప్పారని, సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు ఆధార్ స్థానంలో ఓటరు గుర్తింపు కార్డును ఉపయోగిస్తామంటున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. ఇది మోదీ ప్రభుత్వ అధికారిక విధానమేనా? అని ప్రశ్నించారు.

సాయన్న పేరులోనే సాయముందిరా!"..
పార్టీ సన్నాహక గీతం పంచుకున్న విజయసాయిరెడ్డి

విజయసాయిరెడ్డి, తన పార్టీ విషయంలో కీలక అడుగు ముందుకేశారు. పార్టీ పేరును అధికారికంగా ప్రకటించకముందే, తన భావజాలాన్ని, లక్ష్యాలను ప్రతిబింబించేలా రూపొందించిన ఒక సన్నాహక గీతాన్ని గురువారం సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. "సాయన్న పేరులోనే సాయముందిరా.. విజయసాయిరెడ్డి అన్న అడుగులోనే విజయముందిరా!" అంటూ సాగే ఈ గీతం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. విజయసాయిరెడ్డి తన కొత్త రాజకీయ పార్టీ పేరును నవంబర్ 11న ప్రకటించనున్నట్లు ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ ప్రకటనకు కొద్దిరోజుల ముందే ఈ పాటను విడుదల చేయడం ద్వారా, ప్రజల్లోకి వెళ్లేందుకు ఆయన వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. తన అనుచరుల్లో, కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకే ఈ గీతాన్ని విడుదల చేసినట్లు తెలుస్తోంది. ఒకప్పుడు వైసీపీలో నంబర్ 2గా, అత్యంత కీలక నేతగా చక్రం తిప్పిన విజయసాయిరెడ్డి ప్రస్థానం అనూహ్య మలుపులు తిరిగింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ తరఫున లోక్‌సభకు పోటీ చేసి ఓటమి పాలైన నాటి నుంచి ఆయన పార్టీ కార్యక్రమాలకు, నాయకత్వానికి క్రమంగా దూరం జరుగుతూ వచ్చారు. ఈ పరిణామాల మధ్య పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన ఆయన, ఆ తర్వాత సజ్జల రామకృష్ణారెడ్డిపై తీవ్రమైన ఆరోపణలు చేసి సంచలనం సృష్టించారు. వైసీపీతో బంధం తెంచుకున్న తర్వాత ఆయన ఏదైనా జాతీయ పార్టీలో చేరతారని లేదా మరో ప్రాంతీయ పార్టీలో కీలక పాత్ర పోషిస్తారని విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే, ఆ ఊహాగానాలన్నింటికీ తెరదించుతూ, ఆయన సొంతంగానే రాజకీయ శక్తిగా ఎదిగేందుకు నిర్ణయించుకున్నారు. అందులో భాగంగానే ఇప్పుడు కొత్త పార్టీ ఏర్పాటు దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు.

తెలంగాణను అంతర్జాతీయ స్థాయి
స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని, ప్రసంగించారు. క్రీడారంగ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా తాము చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటే క్రీడాకారులకు తమ ప్రభుత్వ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. దేశ, రాష్ట్ర కీర్తి ప్రతిష్ఠలను పెంచే క్రీడాకారులకు



అన్నివిధాలా ప్రోత్సాహం కల్పిస్తామని స్పష్టం చేశారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

సోషల్ మీడియాలో శ్రీవారి వైభవం - 54 రోజుల్లో 17 కోట్లకు పైగా వ్యూస్

మొదటి పేజి తరువాయి

కోట్లాది మంది భక్తులకు వేంకటేశ్వర స్వామి వారి సేవలు, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవాలు, తిరుమల విశేషాలను చేరవేసేందుకు సామాజిక మాధ్యమాల వేదికలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ క్రమంలో శ్రీవారి నవరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందు, ఉత్సవాల సమయంలో, అనంతరం కలిపి దాదాపు 54 రోజుల వ్యవధిలో వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా శ్రీవారి వైభవానికి సంబంధించిన అంశాలను ఏకంగా 17.54 కోట్ల మంది వీక్షించినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. బ్రహ్మోత్సవాలు, వాహన సేవలు, ధార్మిక కార్యక్రమాలు, స్వామి వారి దివ్యత్వాన్ని వైభవంగా ప్రతిబింబించే దృశ్యాలు భక్తులను ఎంతగానో అలరించాయి. డిజిటల్ వేదికల ద్వారా ఉత్సవాలు వీక్షిస్తూ: ప్రత్యక్షంగా తిరుమలకు దేశ



విదేశాల్లోని భక్తులు చేరుకోలేరు. ఈ క్రమంలో వారంతా వివిధ డిజిటల్ వేదికల ద్వారా స్వామివారి ఉత్సవాలను తిలకిస్తూ, ఆధ్యాత్మిక అనుభూతిని పొందుతున్నారు. దీని ఫలితంగా సోషల్ మీడియాలో టీటీడీకి సంబంధించిన అధికారిక ఖాతాలను అనుసరించే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. టీటీడీ దేవస్థానమ్స్, తిరుమల తిరుపతి దేవస్థానమ్స్ పేరుతో ఈ ఖాతాలు ఉన్నాయి. 17 లక్షలు దాటిన సబ్‌స్క్రైబర్లు: బ్రహ్మోత్సవాలకు ముందు సుమారు 14.5 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 17 లక్షలు దాటింది. అదేవిధంగా యూట్యూబ్ ఛానల్ పెట్టిన నెలరోజులకే 6,000 మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో టీటీడీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా సామాజిక మాధ్యమాల ద్వారా భక్తులకు చేరవేసేందుకు ప్రజా సంబంధాల విభాగం భావిస్తోంది. భక్తులను సామాజిక మాధ్యమాల వేదికగా బురిడీ కొట్టిస్తున్న వారు రోజురోజుకూ పెరిగిపోతుంది. ఈ నేపథ్యంలో భక్తులు టీటీడీ అధికారిక ఖాతాల ద్వారానే సమాచారం కోసం చూడాలని అధికారులు సూచిస్తున్నారు.

'ఆర్ఆర్ ట్యాక్స్' నిజమే అయితే చర్యలేవి? మోదీ, షాలకు కేటీఆర్ ప్రశ్న

మొదటి పేజి తరువాయి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ అగ్రనేతలు ఆరోపణలు చేస్తున్నారే తప్ప చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు. హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ విమర్శలు చేయడం మినహా కేంద్రం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. తన ఎక్స్ పోస్టులో కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్ల గురించి చెబుతారని పేర్కొన్నారు. చదరపు అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు నిజం కాదా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు కేంద్రంలోని బీజేపీ పెద్దలకు తెలియదా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ కలిసి 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని ప్రధాని మోదీ, అమిత్ షా ఆరోపిస్తున్నారని కేటీఆర్ అన్నారు. అలాంటప్పుడు ఆ వసూళ్లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు తరచూ వస్తున్న మోదీ, అమిత్ షాలు ఈ అంశంపై బహిరంగంగా విమర్శలు చేయడం తప్ప, తదుపరి చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు. ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య అంతర్గత అవగాహన ఉందని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్యలకు ముందుకు రావడం లేదని విమర్శించారు. ఆరోపణలు చేయడం, రాజకీయంగా విమర్శలు గుప్పించడం తప్ప ఆ వసూళ్లపై విచారణ జరిపించేందుకు బీజేపీ నేతలు చొరవ చూపడం లేదని అన్నారు. 'ఆర్ఆర్ ట్యాక్స్' అంశంపై ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ ఆరోపణలను తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఖండించింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఈ



అంశం రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది. అయితే చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారన్న కేటీఆర్ ఆరోపణపై స్వతంత్రంగా నిర్ధారితమైన ఆధారాలు ఈ కథనంలో ప్రస్తావించలేదు.

7, 8, 9 తేదీల్లో సీఎం కొడంగల్ పర్యటన

మొదటి పేజి తరువాయి

రూ.81 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన, 10.45కు హకీంపేటలో రూ.4 కోట్లతో నాట్కో సంస్థ సీఎసఆర్ నిధులతో నిర్మించిన జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలను ప్రారంభిస్తారు. 11 గంటలకు రూ.2.35 కోట్లతో నిర్మించిన హకీంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారు. 11.30కు బొంరాస్‌పేటలో రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను, రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.15కు కొడంగల్‌లో రూ.3.80 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. తర్వాత దుద్యాలలో రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను, 1.15కు రూ.12 కోట్లతో నిర్మించిన సమీకృత మండల కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తారు. 1.40కు కోస్గి మండలం నాచారంలో రూ.5,060 కోట్ల అంచనా వ్యయంతో జౌటర్ రింగ్ రోడ్డు వద్ద కొత్వాల్‌గూడ నుంచి నాచారం వద్ద జాతీయ రహదారి 167ఎన్ వరకు నిర్మించనున్న రేడియల్ రోడ్డు-2కు శంకుస్థాపన చేస్తారు. 2 గంటలకు కోస్గిలో రూ.6 కోట్లతో నిర్మించిన సైన్స్ మ్యూజియాన్ని ప్రారంభిస్తారు. 2.45కు దౌల్తాబాద్ మండలం బాలంపేటలో రూ.2.35 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, 3.30కు రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్



కళాశాలను ప్రారంభిస్తారు. అనంతరం కొడంగల్ నివాసానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. 9వ తేదీ సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి కొడంగల్ నివాసం నుంచి హకీంపేటకు బయలుదేరుతారు. రాత్రి 7 గంటల వరకు అక్కడ నిర్వహించే భారీ రైతు బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

రూ.9,053 కోట్లతో 13 అభివృద్ధి పనులు

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మొత్తం రూ.9,053.48 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపనలు, శిలాఫలకాల ఆవిష్కరణలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో కొత్తవాల్‌గూడ నుంచి నాచారం వరకు రూ.5,060 కోట్లతో రేడియల్ రోడ్డు-2, ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.1,410 కోట్లతో 223 కొత్త, అసంపూర్తి బీటీ రహదారుల పనులు, రూ.2,100 కోట్లతో ఎంఎన్‌కేఎలఐఎస్ రెండో దశ పనులు ఉన్నాయి. విద్యా రంగంలో రూ.118.80 కోట్లతో 10 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, రూ.123 కోట్లతో కొడంగల్‌లో వ్యవసాయ కళాశాల నిర్మాణానికి సంబంధించిన పనులు ఉన్నాయి. రూ.41.83 కోట్లతో కొడంగల్, కోస్గి, మద్దూరులో ఆధునిక బస్ స్టాండ్లు, రూ.20 కోట్లతో మద్దూరులో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, రూ.20 కోట్లతో సమీకృత డివిజనల్ కార్యాలయ సముదాయం, రూ.59.30 కోట్లతో రహదారుల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. తిమ్మారెడ్డిపల్లిలో గురులోక మసంద్ ప్రభు మందిరం అభివృద్ధికి రూ.4.45 కోట్లు, కొడంగల్‌లో నిరంజన్ మఠం అభివృద్ధికి రూ.5.10 కోట్లు కేటాయించారు. హకీంపేట ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.10 కోట్లతో పర్యాటక హోటల్ నిర్మాణం, రూ.81 కోట్లతో ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నారు. రూ.46.08 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న 10 ప్రభుత్వ భవనాలను ఈ పర్యటనలో ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు.

ధైర్యం ఉంటే ప్రధానికి అధికారికంగా లేఖ రాయండి'- రాహుల్‌కు అమిత్ షా కౌంటర్

మొదటి పేజి తరువాయి

కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకుగా ఉన్నారని, అందుకే ఓటర్ల జాబితా ప్రక్షాళనను అడ్డుకునేందుకు 'ఓట్ల చోరీ' అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. దేశ పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉండాలని, చొరబాటుదారుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తప్పనిసరిగా తొలగించాలని అమిత్ షా పేర్కొన్నారు.

పార్లమెంట్‌లో చర్చకు బదులు ఆందోళనలా?

ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ చర్చలకు అత్యున్నత వేదిక అని అమిత్ షా అన్నారు. అలాంటి వేదికలో కీలక అంశాలపై చర్చించకుండా కాంగ్రెస్ అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. పార్లమెంట్‌ను పనిచేయనివ్వకుండా బయట వీధుల్లో ఆందోళనలు చేస్తూ అరాచకాన్ని ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. 80 ఏళ్ల ప్రజాస్వామ్యం తమ మోసాలకు లొంగిపోతుందని కాంగ్రెస్ భావిస్తోందా అని ప్రశ్నించారు. పార్లమెంట్, శాసనసభలు, గ్రామాలు, పొలాల్లోనూ బీజేపీ కాంగ్రెస్‌కు తగిన సమాధానం ఇస్తుందని వ్యాఖ్యానించారు. ప్రజలను సమీకరించి ఆందోళనలు చేయాలని కాంగ్రెస్ భావిస్తే, ఎదుర్కొనేందుకు బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, అరాచకాన్ని తొలగించండి' యాత్ర రాహుల్ గాంధీకి బలమైన సమాధానమని పేర్కొన్నారు.

ఓటు హక్కు విలువను వివరించిన సీఎం సైనీ

మరోవైపు, హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ కూడా కాంగ్రెస్‌పై విమర్శలు చేశారు. ప్రజాస్వామ్యానికి అతిపెద్ద బలం సామాన్య పౌరుడి ఓటు అని అన్నారు. సంపద, పలుకుబడి, ప్రముఖ కుటుంబాల మద్దతు లేకపోయినా, పోలింగ్ బూత్‌లో ప్రతి పౌరుడికి సమాన ఓటు హక్కు ఉంటుందని వివరించారు. ఆ ఒక్క ఓటు రైతుల కష్టం, కార్మికుల ఆకాంక్షలు, యువత భవిష్యత్తు, మహిళల ఆశలను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిర్వహించే ఓటర్ల జాబితా సవరణ సాధారణ ప్రక్రియేనని సైనీ అన్నారు. అయితే కాంగ్రెస్ అసత్యాలను ప్రచారం చేస్తూ దేశవ్యాప్తంగా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మహిళలు, యువత, రైతుల సంక్షేమానికి



ప్రాధాన్యమిస్తూ దేశం అభివృద్ధి చెందుతోందని బీజేపీ నేతలు పేర్కొన్నారు. కాగా రాహుల్ గాంధీ ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమంటూ చేసిన ఈ వ్యాఖ్య, దేశంలోని 73 శాతం మంది యువత తామిద్దరి మధ్య చర్చను కోరుకుంటున్నారని చెప్పారు. ప్రధాని మోదీ ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదని, కేవలం కీలక దేశీయ అంశాలపై చర్చించడానికి వస్తే చాలని ఆయన పిలుపునిచ్చారు. నిరుద్యోగం, దేశ భద్రత, ఆర్థిక వ్యవస్థ వంటి ప్రజా సమస్యలపై దేశ అగ్రనేతలు ఇద్దరూ ఒకే వేదికపై చర్చించడం ప్రజాస్వామ్యానికి ఎంతో అవసరమని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.

దిల్లీ నిరసనలపై సుప్రీం కీలక వ్యాఖ్యలు- నెలరోజుల్లోగా నివేదికను సమర్పించాలని

మొదటి పేజి తరువాయి

హెచ్‌పీసీ తన ప్రాథమిక వాస్తవ నిర్ధరణ నివేదికను నెలలోగా సమర్పించాలని కోరింది. మరిన్ని ఫిర్యాదుల కోసం ఎదురుచూస్తూ కమిటీ తన పనిని నిరవధికంగా వాయిదా వేయకూడదని పేర్కొంది. ఉన్నత స్థాయి కమిటీ వద్ద ఇప్పటికే అందుబాటులో ఉన్న సమాచారంతో ముందుకు సాగాలని స్పష్టం చేసింది. సంబంధిత అధికారుల నుంచి సమాధానాలను కోరాలని, అలాగే కోర్టు గుర్తించిన రెండు ప్రాధాన్యత అంశాలపై తన నివేదికను సమర్పించాలని చెప్పింది. ఈ మేరకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఆ రెండింటి మధ్య చాలా వ్యత్యాసం ఉంది : సుప్రీంకోర్టు

పిటిషనర్లు, ఇతర సంబంధిత వ్యక్తుల తరఫు న్యాయవాదులను వారి వద్ద ఉన్న ఫిర్యాదులు, వీడియోలు, ఇతర సాక్ష్యాలను ఉన్నత స్థాయి కమిటీ పంపాలని సుప్రీంకోర్టు కోరింది. పిటిషనర్లు సమర్పించామని చెబుతున్న సమాచారానికి, కమిటీకి వాస్తవంగా చేరిన సమాచారానికి మధ్య వ్యత్యాసం ఉందని పేర్కొంది. కమిటీకి దాని పోర్టల్ ద్వారా, ప్రత్యక్షంగా చాలా తక్కువ ఫిర్యాదులు అందాయని వెల్లడించింది. బాధితులు స్వయంగా కమిటీని ఆశ్రయించకపోయినప్పటికీ, వారి తరఫున న్యాయవాదులు, ప్రజాహితం కోసం చేసే పనిచేసే వ్యక్తులు పంపిన సమాచారాన్ని కూడా పరిశీలించాలని హెచ్‌పీసీని సూచించింది. దిల్లీ నిరసనల్లో పోలీసుల బలప్రయోగంపై ఉన్నత స్థాయి కమిటీ అక్టోబర్ 31న సమర్పించిన నివేదిక కేవలం స్టేటస్ రిపోర్ట్ మాత్రమేనని తెలిపింది. అందులో ఎలాంటి నిజ నిర్ధరణలు లేవని స్పష్టం చేసింది. గోప్యతను పాటించాల్

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీకి 'ఇందిరమ్మ ఇళ్లు మహాత్మా జ్యోతిరావు పూలే కాలనీ'గా నామకరణం

- రేపు మంత్రుల చేతుల మీదుగా 560 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ

- పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులతో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సమీక్ష

మిర్యాలగూడ నవంబర్ 5 (ప్రజా న్యూస్ నెట్వర్క్ పి వెంకటయ్య)

మిర్యాలగూడ మండల పరిధిలోని వెంకటాద్రిపాలెం సమీపంలో నూతనంగా నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను రేపు రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయనున్న నేపథ్యంలో, కార్యక్రమ ఏర్పాట్లపై మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి – తన క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు...ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి, వెంకటాద్రిపాలెం సమీపంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీకి "ఇందిరమ్మ ఇళ్లు మహాత్మా జ్యోతిరావు పూలే కాలనీ" గా నామకరణం చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు.అనంతరం రేపు జరగనున్న 560 ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు





పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు, ముఖ్యంగా ఇళ్లను పొందనున్న లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు... కాలనీలో అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ తదితర సదుపాయాలను పక్కాగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఎమ్మెల్యే కోరారు.ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీవో రమణారెడ్డి, ఇన్‌చార్జి డీఎస్పీ రవి, మున్సిపల్ కమిషనర్ శ్రీజారెడ్డితో పాటు వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు...

కార్మిక వాడల సృష్టికర్త మాజీ మున్సిపల్ చైర్మన్ కీర్తిశేషులు కే ఎం పాండు వర్ధంతి ఘనంగా నిర్వహించారు

కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర ఓబిసి జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్

కుత్బుల్లాపూర్. నవంబర్.5 ప్రజా న్యూస్ నెట్వర్క్ ..

కుత్బుల్లాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ కార్మిక నాయకుడు కీర్తిశేషులు కే ఎం పాండు వర్ధంతి చింతల్ లో ఘనంగా నిర్వహించారు కే ఎం పాండు విగ్రహానికి పూలమాలలు వేసి నీవాళ్లు అర్పించి ఐ ఎన్ టి యు సి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్రీయ ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ కార్మికులు దళిత నాయకులతో కలిసి ఘనంగా నివాళులర్పించి ఐఎన్టీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్రీయ ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ ఒకప్పుడు అరణ్య ప్రాంతం కే ఎం పాండు చొరవతో కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ ఉన్నప్పుడు హెచ్ఎంటి కంపెనీ స్థాపించడంలో



జీడిమెట్ల షాపూర్ నగర్ కుత్బుల్లాపూర్ పారిశ్రామిక అభివృద్ధి కోసం కె ఎం పండు ఎనలేని కృషి చేశారు పరిశ్రమలతో పాటు వివిధ రాష్ట్రాలు జిల్లాల నుండి వలస వచ్చిన నిరుపేదలకు గూడు ఉండాలని పేదల పక్షాన నిలబడి నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి కార్మిక వాడలను సృష్టించిన కీర్తిశేషులు కేం పాండు చరిత్ర చాలా గొప్పదని అన్నారు నాటి తరం నాయకులు నేటి తరమునాయకులకు కే ఎం పండు జీవితం ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు తన కుమారుడు వివేకానంద కుత్బుల్లాపూర్ నియోజక వర్గం శాసన సభ్యునిగా ప్రజలకు సేవలు అందిస్తూ ప్రజా నాయకునిగా తన తండ్రి ఆశయాలను నెరవేరుస్తున్నందుకు వారికి అభినందనలు అన్నారు కీర్తిశేషులు కే ఎం పండు నిస్వార్థ రాజకీయ సేవ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు ఈ కార్యక్రమంలో ఉత్బుల్లాపూర్ నియోజక వర్గం ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు హెచ్ఎంటి కృష్ణ గౌడ్ రాష్ట్రీయ దళిత సేన అధ్యక్షులు డాక్టర్ అవి జెమ్స్ శంకర్ కార్మిక నాయకులు దళిత నాయకులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు

తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు, కార్మికులకు అభినందనలు

- ఏపీ ఈపీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్) టి. సూర్య ప్రకాష్





మిర్యాలగూడ నవంబర్ 5 (ప్రజా న్యూస్ నెట్వర్క్ పి వెంకటయ్య)

మిర్యాలగూడ:– ఏపీలో అర్నబ్ తుఫాన్ ధాటికి పలు డివిజన్లలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తమైంది. ముఖ్యంగా నర్సాపూర్ డివిజన్, మొగల్తూరు సెక్షన్ లో విద్యుత్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. ఎన్నో రోజుల నుండి గ్రామాలలో, పట్టణాలలో కరెంటు లేక ప్రజలు, విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ శాఖ మేనేజ్మెంట్ తక్షణ సహాయాన్ని అందించింది.అన్ని సర్కిల్స్ నుండి తెలంగాణ విద్యుత్ శాఖ సిబ్బంది ఏపీ రాష్ట్రానికి చేరుకున్నారు. నర్సాపూర్ డివిజన్, మొగల్తూరు సెక్షన్ స్థానిక ఏడీఈ రాజీవ్, లైన్ మెన్ సుధీర్ తో కలిసి కరెంటు పునరుద్ధరణ పనుల్లో భాగంగా గ్రామాలు, పట్టణాలను పరిశీలించడానికి ఏపీ ఈపీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్) టి. సూర్య ప్రకాష్, సీజీఎం, జీఎం వెళ్లారు. పడిపోయిన స్తంభాలను, లైన్లను, జరుగుతున్న పనులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ డివిజన్ లో 33 కేవీ, 11 కేవీ, ఎల్.టి. లైన్లకు చెందిన దాదాపు 1000 స్తంభాలు తుఫానుకు విరిగి పడిపోయాయి. వాటిని నూతనంగా ఏర్పాటు చేసి, పునరుద్ధరణ పనులు చేసి అదే రోజు గ్రామాలలో, పట్టణాలలో కరెంటు ఇవ్వడం జరుగుతున్నందున అధికారులు ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఏపీ ఈపీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్) టి. సూర్య ప్రకాష్ మాట్లాడుతూ నల్గొండ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ అమరారపు శ్రీనివాస్, మిర్యాలగూడ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ చారి, ఏఈలు వినోద్ కుమార్, రవీందర్ రెడ్డి, వీరభద్రం, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ మారం శ్రీనివాస్ లతో పాటు కార్మికులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రజలు, కార్మికులు ఎల్లయ్యచారి, బిక్షమయ్య, జలంధర్, సతీష్, వెంకటరత్నం, సిబ్బంది వెంకన్న, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జువైనల్ జస్టిస్ బోర్డులో న్యాయ అవగాహన కార్యక్రమం

(సంగారెడ్డి, మండలం) నవంబర్ 5: ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

నవంబర్ 9న నిర్వహించనున్న జాతీయ న్యాయ సేవల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సంగారెడ్డిలోని జువైనల్ జస్టిస్ బోర్డు కార్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య మాట్లాడుతూ, బాలల హక్కులు, సంరక్షణ, రక్షణ చట్టాలు, ముఖ్యంగా జువైనల్ జస్టిస్ చట్టం2015లోని ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. బాలలపై హింస, వేధింపులు, బాల కార్మికత్వం, బాల్యవివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.చట్టంతో సంఘర్షణలో ఉన్న బాలలను నేరస్థులుగా చూడకుండా, వారికి కౌన్సెలింగ్, విద్య, పునరావాసం ద్వారా మంచి భవిష్యత్తు కల్పించాలని తెలిపారు. అర్హులైన బాలలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్-కమ్-అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె. ధనలక్ష్మి, జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులు వాసుదేవ్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్, న్యాయవాది నిజాముద్దీన్, లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయవాది జె. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



దివంగత నేత కేఎం.పాండు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

: బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్...



కుత్బుల్లాపూర్. నవంబర్.5 ప్రజా న్యూస్ నెట్వర్క్ ..

కుత్బుల్లాపూర్ రాజకీయ పితామహుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ స్వర్గీయ శ్రీ కేఎం.పాండు 8వ వర్ధంతిని పురస్కరించుకొని చింతల్‌లోని కేఎం.పాండు మార్గ్ వద్ద నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో ఆయన తనయుడు, బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్గీయ కేఎం.పాండు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి స్వర్గీయ శ్రీ కేఎం.పాండు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్యాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుచూపుతో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. అక్షరాస్యతతోనే పేద ప్రజల జీవితాల్లో నిజమైన వెలుగులు నిండుతాయని బలంగా విశ్వసించి, విద్యకు విశేష ప్రాధాన్యతనిస్తూ ఎన్నో కుటుంబాల జీవితాల్లో మార్పునకు కృషి చేసిన మహానేత అని కొనియాడారు.రాజకీయ రంగంలో తనదైన ముద్ర వేసుకున్న కేఎం.పాండు ఎంతోమందికి రాజకీయంగా అవకాశాలు కల్పిస్తూ, ప్రజాసేవకు మార్గదర్శకంగా నిలిచారని అన్నారు. ఆయన ప్రజాసేవా స్ఫూర్తిని, ఆశయాలను కొనసాగిస్తూ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ పార్టీల నాయకులు, మహిళా నాయకురాళ్లు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొని స్వర్గీయ కేఎం.పాండు కి ఘనంగా నివాళులర్పించారు.

సంగారెడ్డి పట్టణం లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన నిర్మలా జగ్గారెడ్డి

- 13వ వార్డులో రూ.10 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

- 34వ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో సీసీ డ్రైన్ పనులకు శ్రీకారం



(సంగారెడ్డి మండలం) నవంబర్ 5:ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

సంగారెడ్డి పట్టణంలోని 13, 34వ వార్డుల్లో చేపట్టనున్న డ్రైనేజీ అభివృద్ధి పనులను టీజీఐఐసీ మాజీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు.పట్టణంలోని 13వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆమె శ్రీకారం చుట్టారు. అదేవిధంగా 34వ వార్డులో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో చేపట్టనున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, వైస్ చైర్మన్ షఫీ, కౌన్సిలర్లు వీణా కిరణ్, అన్వర్, మహేష్, శ్రీకాంత్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు మహేందర్ రెడ్డి, శ్రీధర్, రాజశేఖర్ రెడ్డి, అడ్డూ, మున్నా, రాజు తదితరులు పాల్గొన్నారు.

సాయి గ్రామర్ స్కూల్‌లో దామోదర దీపోత్సవం

చిలుకూరు: నవంబర్ 5(ప్రజా న్యూస్ నెట్ వర్క్ సూరిబాబు)

పవిత్ర దామోదర మాసం సందర్భంగా స్థానిక చిలుకూరు సాయి గ్రామర్ స్కూల్‌లో విద్యార్థులు ఇస్కాన్ సంస్థ సభ్యురాలు బోనగిరి హైమ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో దామోదర దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీ దామోదరుడి (శ్రీకృష్ణుడు) చిత్రపటం ఎదుట విద్యార్థులందరూ నేతి దీపాలు వెలిగించి, దామోదర అష్టకం పఠిస్తూ భక్తితో హారతులు సమర్పించారు.ఈ సందర్భంగా పాఠశాల /ప్రిన్సిపాల్ గవిని ఆంజనేయులుమాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువల పట్ల విద్యార్థులకు చిన్నతనం నుంచే అవగాహన కల్పించేందుకే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దామోదర మాసంలో దీపదానం చేయడం వల్ల జీవితంలో అజ్ఞానం తొలగి, సద్బుద్ధి, విజ్ఞానం లభిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని లు దీప్తి, ఉమా, అనూష, అరుణ, ఇందిరా, ఇందు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు...



చౌటాకుర్ మండల కేంద్రంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం.





ప్రజా న్యూస్ నవంబర్ 05 (అందోల్ ప్రతినిధి మొహమ్మద్ ఆబేద్)

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలకు చెందిన రావెప్ విద్యార్థులు, సంగారెడ్డి తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, సంగారెడ్డి ఆధ్వర్యంలో చౌటకూరు మండల కేంద్రంలో నిర్వహించిన రైతు సదస్సు మరియు వ్యవసాయ ప్రదర్శన అత్యంత విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆందోల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఏడిఏ రమాదేవి మాట్లాడుతూ ప్రస్తుత యాసంగి సీజన్‌లో రైతులు నీటి ఎద్దడిని తట్టుకునే ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రతినిధి డా. ఎం. మాధవి మాట్లాడుతూ.. నేల ఆరోగ్య పరిరక్షణ, నాణ్యమైన విత్తనాల ఎంపిక ప్రాధాన్యతను వివరిస్తూనే, ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా పుట్టగొడుగుల పెంపకాన్ని చేపట్టాలని రైతులకు సూచించారు. సంగూపేట్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ డా. ఎ. నిర్మల యాసంగిలో సాగు చేయాల్సిన లాభదాయకమైన కూరగాయల పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. సంగారెడ్డి కోఆర్డినేటర్ డా. కె. అరుణ మాట్లాడుతూ.. రాబోయే 'ఎల్నినో' వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అందుబాటులో ఉన్న తక్కువ నీటితో సమర్థవంతంగా సాగయ్యే పంటలను ఎంచుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.ఈ ప్రదర్శనలో భాగంగా రావెప్ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఆధునిక వ్యవసాయ పద్ధతులు, యాంత్రీకరణ, మిశ్రమ పంటలు మరియు సూక్ష్మ నీటి యాజమాన్య వర్కింగ్ మోడళ్లు (లైవ్ మోడల్స్) ఎంతగానో ఆకట్టుకున్నాయి. వ్యవసాయ రంగంలో వస్తున్న సాంకేతిక మార్పులను రైతులు క్షేత్రస్థాయిలో అన్వయించుకోవాలని ఈ సందర్భంగా అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో చౌటకూరు సర్పంచ్ రాంరెడ్డి, చౌటకూరు వ్యవసాయ అధికారిణి ఏవో ప్రవీణ, ఏఈఓ గాయత్రి, ఆందోల్ వ్యవసాయ అధికారి శ్రీహరి, పుల్కల్ వ్యవసాయ అధికారి చైతన్య తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సదస్సుకు చుట్టుపక్కల గ్రామాలైన సుల్తాన్‌పూర్, షరీఫ్‌పల్లి, చౌటకూరు, సంగూపేట్, డాకూర్, బ్రాహ్మణపల్లి, సాయిబాన్‌పేట్ నుండి రైతులు తరలివచ్చి ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించి విజయవంతం చేశారు.

సికింద్రాబాద్‌విజయవాడ ఇంటర్‌సిటీ 12796 ఎక్స్‌ప్రెస్ రైలును మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో నిలపాలి.


- విజయవాడలింగంపల్లి ఇంటర్‌సిటీ 12795 ఎక్స్‌ప్రెస్ రైలుకు మిర్యాలగూడలో హాల్టింగ్ కల్పించాలని

మిర్యాలగూడ నవంబర్ 5 (ప్రజా న్యూస్ నెట్వర్క్ పి వెంకటయ్య)

హైదరాబాద్ రైల్ నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీ వాత్సవ కార్యాలయంలో విజ్ఞప్తి చేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో విధులు నిర్వహించే ఉద్యోగులు,ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ప్రారంభించిన సికింద్రాబాద్‌విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో నిలపకపోవడం వల్ల ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మిర్యాలగూడ రైల్వే స్టేషన్ లో ఆపే విధంగా చూడాలని కోరుతూ ఈరోజు హైదరాబాదులోనే రైలు నిలయం సౌత్ సెంట్రల్ జనరల్ మేనేజర్ . సంజయ్ కుమార్ శ్రీ వాత్సవ కార్యాలయంలో విజ్ఞప్తి చేసినట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణం వాణిజ్య, వ్యాపార రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందుతుందని ఈ ప్రాంతం నుంచి ప్రతిరోజూ అనేకమంది వ్యాపారులు, ఉద్యోగులు,





విద్యార్థులు, సామాన్య ప్రయాణికులు వివిధ పనుల నిమిత్తం గుంటూరు, విజయవాడ నగరాలకు రాకపోకలు సాగిస్తున్నారు.అదే విధంగా విజయవాడ నుంచి ప్రారంభమయ్యే లింగంపల్లి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును కూడా మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో నిలిపితే ఈ ప్రాంత ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.కావున ప్రయాణికుల అవసరాలు, మిర్యాలగూడ ప్రాంత అభివృద్ధి, వాణిజ్య ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని సికింద్రాబాద్‌విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌తో పాటు విజయవాడలింగంపల్లి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించే విధంగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు, రైల్వే శాఖ ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని బీసీ జేఏసీ తరపున విజ్ఞప్తి చేస్తున్నాం.

పత్తి క్వింటాల్‌కు రూ.9,500 మద్దతు ధర చెల్లించాలి కౌలు రైతులను ఆదుకోవాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి జయరాజు డిమాండ్

(సంగారెడ్డి మండలం) నవంబర్ 5 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

పత్తి పంటకు క్వింటాల్‌కు రూ.9,500 మద్దతు ధర చెల్లించాలని, పంట నష్టపోయిన కౌలు రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతు సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నేడు రైతు సంఘం ఆధ్వర్యంలో సదాశివపేట పట్టణ పరిధిలో రైతులతో కలిసి పత్తి పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ.. ఎల్‌నినో కరువు ప్రభావంతో పత్తి పంట తీవ్రంగా దెబ్బతిన్నదని, ఎకరాకు కనీసం మూడు క్వింటాళ్ల పత్తి కూడా దిగుబడి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పంట సాగు కోసం పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని అన్నారు.పత్తి క్వింటాల్‌కు రూ.9,500 మద్దతు ధర కల్పించాలని, పంట దిగుబడి లేక అప్పుల పాలవుతున్న కౌలు రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంగారెడ్డి జిల్లాలోని 28 మండలాలకు వెంటనే కరువు నిధులు కేటాయించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా నవంబర్ 15 నుంచి 18 వరకు నల్గొండలో నిర్వహించనున్న రైతు సంఘం అఖిల భారత 36వ మహాసభలను విజయవంతం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భూషణం,



ఏషూబు, బుచ్చయ్య, శివయ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

లక్ష్మవరం గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు..

భద్రతకు పెద్దపీట!

- నేరాల నియంత్రణకు సాంకేతిక నిఘా.. ప్రజలకు ఎస్ఐ అవగాహన

- గ్రామ రక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం: ఎస్ఐ చలికంటి నరేష్



హుజూర్‌నగర్ మండలం, నవంబర్ 5, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్ : హుజూర్‌నగర్ మండలం లక్ష్మవరం గ్రామంలో స్థానిక నాయకుల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా హుజూర్‌నగర్ ఎస్ఐ చలికంటి నరేష్ గ్రామ ప్రజలకు సీసీ కెమెరాల ప్రాముఖ్యత, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో నేరాలను అరికట్టడం, అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించడం, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడంలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ప్రధాన కూడళ్లు, రహదారులు, కీలక ప్రాంతాల్లో కెమెరాల నిఘా ఉండటం వల్ల అనుమానాస్పద కదలికలను గుర్తించడంతో పాటు ఏదైనా ఘటన జరిగినప్పుడు దర్యాప్తునకు అవసరమైన ఆధారాలు సేకరించేందుకు వీలవుతుందని తెలిపారు. సాంకేతిక నిఘా పోలీసుల విధులకు మరింత తోడ్పడుతుందని, గ్రామంలో భద్రతాభావాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి గ్రామ భద్రతకు తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలని ఎస్ఐ నరేష్ పిలుపునిచ్చారు. గ్రామ భద్రత కోసం ముందుకొచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన స్థానిక నాయకులను అభినందించారు.

డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ 'భీమ్ హోమ్' శంకుస్థాపన



చిలుకూరు నవంబర్ 5(ప్రజా న్యూస్ నెట్ వర్క్ సూరిబాబు)

చిలుకూరు మండల కేంద్రంలో నవంబర్ 6వ తేదీ (శుక్రవారం) స్వేరోస్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ పర్యటించనున్నారు.దివంగత కందుకూరి గురవయ్య కుటుంబానికి అండగా నిలుస్తూ, వారి పిల్లల కోసం జిల్లా స్వేరోస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన 'భీమ్ హోమ్' ఇళ్ల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.ఈ సందర్భంగా స్వేరోస్ జిల్లా అధికారప్రతినిధి విజయ నిర్మల స్వేరో మాట్లాడుతూ, చిలుకూరు మండల పరిధిలోని స్వేరోస్ కుటుంబ సభ్యులు, ఆర్.ఎస్.పి అభిమానులు మరియు జిల్లా పి.పి.ఎల్ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు....

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

బోనస్ బకాయిలు వెంటనే చెల్లించాలి: ఎమ్మెల్యే చింత ప్రభాకర్

(సంగారెడ్డి మండలం) నవంబర్ 5 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులను కోరారు. సంగారెడ్డి మండలంలోని కులాబ్‌గుర్, కొత్తాపూర్ గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, తాగునీరు, నీడ వంటి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. సన్నధాన్యానికి ప్రకటించిన క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను అర్హులైన రైతులందరికీ చెల్లించడంతో పాటు, గత ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు.విద్యుత్ కోతలు, పంట రుణాలు, ఎరువుల కొరత సమస్యలను పరిష్కరించాలని, ధాన్యం తూకం, తేమ శాతం పరీక్షల్లో పారదర్శకత పాటించి, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని అధికారులకు సూచించారు. రైతులకు చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చక్రపాణి, గ్రామాల సర్పంచులు, డీసీఎంఎస్ ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.





కొర్లయ్యపేటలో ఓటు వేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎంపీపీ పాఠశాలలోని 78వ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

పాయకరావుపేట (కొర్లయ్యపేట), నవంబర్ 5 ప్రజా న్యూస్ నెట్వర్క్:

కొర్లయ్యపేటలోని ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన 78వ పోలింగ్ బూత్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గ క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు బొడ్డు హరిబాబు, మండల ప్రచార విభాగం అధ్యక్షులు మైలపల్లి శివాజీ, పాలమానుపేట పంచాయతీ బీసీ సెల్ అధ్యక్షులు దైలపల్లి బాబుజీ, పంచాయతీ ప్రధాన కార్యదర్శి మైలపల్లి కాసులు ఓటు వేశారు. అలాగే పంచాయతీ విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి మైలపల్లి కోటి, మండల యువజన విభాగం కార్యదర్శి పిరమళ్ళ వెంకట సాయికుమార్, పంచాయతీ విద్యార్థి విభాగం కార్యదర్శి సింగిరి



విజయ్, పాయకరావుపేట మండల విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు బొడ్డు జాన్ కిషోర్, పాలమానుపేట పంచాయతీ రైతు విభాగం కార్యదర్శి మోసా శ్రీను ఓటు హక్కును వినియోగించుకున్నారు. యువ నాయకులు పిరమళ్ళ ప్రసాద్, చొక్కా అప్పలరాజు, సింగిరి ప్రసాద్, మైలపల్లి అశోక్, పిరమళ్ళ సుబ్బారావు, పిరమళ్ళ వెంకట రమణ తదితరులు కూడా పోలింగ్‌లో పాల్గొన్నారు.

మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో రూ.2.92 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు.





హైదరాబాద్ ఉప్పల్ ప్రతినిధి కె శివ కుమార్ నవంబర్ 05 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్):

మీర్పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో సుమారు రూ. 2 కోట్ల 92 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని, ప్రజలకు అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం వివిధ కాలనీల ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ, డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి నిరంతరం సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నవోదయ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ పోచమ్మ ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రాజీవ్ నగర్ కాలనీ గ్రౌండ్‌లో రూ. 13 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఓపెన్ జిమ్ కోసం శంకుస్థాపన చేశారు. బక్షిగూడ కాలనీలో రూ. 34.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. లక్ష్మీనగర్ స్మశాన వాటికలో రూ. 1 కోటి 55 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హెచ్‌బీ కాలనీ ఫేజ్,1 రూ. 34 లక్షల అంచనా వ్యయంతో అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి దిగువ వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తిరుమలనగర్ కాలనీ గ్రౌండ్‌లో రూ. 20 లక్షల అంచనా వ్యయంతో చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్‌మెంట్స్, వాక్‌వే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కృష్ణానగర్ కాలనీ గ్రౌండ్‌లో రూ. 36 లక్షల అంచనా వ్యయంతో చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్‌మెంట్స్ ఏర్పాటు, ఇప్పటికే ఉన్న కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, ఏఈ స్పందన, నాయకులు ఉల్లెం బాలరాజు, గుమ్మడి జంపాల్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శివరాం ప్రసాద్, గోవర్ధన్ రెడ్డి, దేవేందర్ కుమార్, నరసింహ గౌడ్, మల్లారెడ్డి, దేవి రాజ్, చారి, బాలయ్య గౌడ్, రాజు, మల్లేష్ గౌడ్, అమరేంద్రబాబు, సింగపాక లింగం, రామకృష్ణ, కిరణ్, జయపాల్, లింగం, పోచయ్య, అంజయ్య, సుధాకర్, హరినాథ్ రెడ్డి, భూపాల్ గౌడ్, పూస రమేష్, కుమార్, చంద్రశేఖర్, శేఖర్ గౌడ్, శివ, దండెం నరేందర్ తదితరులు మరియు ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

దీపావళి పండుగను జాగ్రత్తగా జరుపుకోవాలి. జోగిపేట ఎస్సై గిరి శ్రీకాంత్.



ప్రజా న్యూస్ నవంబర్ 05 (అందోల్ ప్రతినిధి మహమ్మద్ ఆబేద్)

దీపావళి పండుగను జాగ్రత్తగా జరుపుకోవాలి –జోగిపేట ఎస్సై గిరి శ్రీకాంత్

అందోల్ నియోజకవర్గంలోని అందోల్ మండల ప్రజలందరూ దీపావళి పండుగను ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకోవాలని జోగిపేట ఎస్సై గిరి శ్రీకాంత్ కోరారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. టపాసులు విక్రయించే దుకాణదారులు తప్పనిసరిగా పోలీస్, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతులు పొందాలని, అనుమతులు లేకుండా విక్రయాలు జరిపితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టపాసులు కాల్చేవారు జనసంచారం లేని బహిరంగ ప్రదేశాలను ఎంచుకోవాలని, ఇళ్లు, దుకాణాలు, వాహనాలకు దూరంగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. చిన్నపిల్లలు టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు తప్పనిసరిగా దగ్గరుండి పర్యవేక్షించాలని తెలిపారు. ప్రజలందరూ పోలీసుల సూచనలు, భద్రతా నిబంధనలు పాటిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో, సురక్షితంగా జరుపుకోవాలని జోగిపేట ఎస్సై గిరి శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు.

మహనీయుల విగ్రహాలకు ఇదేనా గౌరవం



త్రిపురారం మండలం నవంబర్ 5 ప్రజా న్యూస్ నెట్వర్క్ రిపోర్టర్ గాసిరాం

త్రిపురారం మండల కేంద్రంలోని ఎమ్మార్వో ఎంపీడీవో కార్యాలయాలు పోలీస్ స్టేషన్ సమీపంలో మహనీయుల విగ్రహాలను రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా ఉంచడం బాధాకరం నిత్యం అధికారులు సంచరించే ప్రాంతంలోనే ఈ పరిస్థితి నెలకొనడంపై స్థానికులు ఆవేదనలో వ్యక్తం చేస్తున్నారు అధికారులు వెంటనే స్పందించి విగ్రహాలను గౌరవప్రదమైన ప్రదేశంలో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మిర్యాలగూడ పట్టణానికి చెందిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు అర్హులైన వారికి అందజేయాలి

- మాజీ నల్లమోతు భాస్కర్ రావు ..

- డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో పారదర్శకత పాటించి నిజమైన అర్హులకు న్యాయం చేయాలి

మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి గారికి వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు- నల్లమోతు సిద్ధార్థ గారు

మిర్యాలగూడ నవంబర్ 5(ప్రజా న్యూస్ నెట్వర్క్ పి వెంకటయ్య)



మిర్యాలగూడ మున్సిపాలిటీకి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన 565 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో పారదర్శకత పాటించి, నిజమైన అర్హులైన పేదలకు న్యాయం చేయాలని కోరుతూ మిర్యాలగూడ పట్టణ బీఆర్ఎస్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో రెడ్డి కాలని పార్టీ కార్యాలయం లో సమావేశం నిర్వహించుకొని అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వాసితులతో ధర్నా నిర్వహించి అనంతరం మిర్యాలగూడ ఆర్డీవో కి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు కృషితో మిర్యాలగూడ మున్సిపాలిటీకి 565 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో 40 ఇళ్లను భూనిర్వాసితులకు కేటాయించగా, మిగిలిన ఇళ్లకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించి, వార్డుల వారీగా సభలు నిర్వహించి ప్రజల సమక్షంలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు.

అయితే 194 ఇళ్లకు సంబంధించి ఎంపికైన వారికి అర్హత లేదనే కారణంతో పట్టాలు ఇవ్వలేదని, ప్రస్తుతం ఎలాంటి దరఖాస్తులు స్వీకరించకుండా, సమగ్ర సర్వే నిర్వహించకుండా ఇళ్ల కేటాయింపులు చేపట్టడం సరికాదన్నారు.

మిర్యాలగూడ మున్సిపాలిటీలోని ఒక వార్డుకు చెందిన వారికి మరొక వార్డులో ఇళ్లు కేటాయించడం, మున్సిపాలిటీ పరిధిలో నివసించని మండలాల వారికి మున్సిపాలిటీలో ఇళ్లు కేటాయించడం సమంజసం కాదని పేర్కొన్నారు. అదేవిధంగా భూములు, ఇళ్లు కోల్పోయిన గుమాస్తాల కాలనీ, గుబిలి కాలనీలకు ఇచ్చిన 40 ఇళ్ల హామీలో మిగిలిన ఏడుగురికి కూడా న్యాయం చేయాలని కోరారు.

కావున 194 ఇళ్లకు సంబంధించి తిరిగి దరఖాస్తులు స్వీకరించి, మున్సిపాలిటీలోని 48 వార్డుల్లో సమగ్ర సర్వే నిర్వహించి నిజమైన అర్హులను గుర్తించాలని, వార్డుల వారీగా పారదర్శకంగా లాటరీ పద్ధతిలో ఇళ్లను కేటాయించాలని ఆర్డీవో గారిని కోరినట్లు తెలిపారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయ జోక్యాలకు, అవకతవకలకు తావులేకుండా నిజమైన నిరుపేదలకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమములో ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, అన్నబీమోజు నాగార్జున చారి, ఎండి.ఇలియాస్ ఖాన్, ఎండి.మగ్దుం పాషా, పెద్ది శ్రీనివాస గౌడ్, ఎండి.మాజీద్,పద్మశెట్టి లక్ష్మి కోటేశ్వర రావు,దైద సత్యం, బంటు శ్రీనివాస్, పునాటి లక్ష్మి నారాయణ,పాలరపు సత్యనారాయణ, జి డి ఆర్ జాని, సాధినేని శ్రీనివాస రావు , సందేషి రజిని అంజన్ రాజు,పెండ్యాల పద్మ, కోదాటి రమా, గడ్డం దీపిక విజయ్, గుడిసె జానకమ్మ దుర్గాప్రసాద్,తిరుమలగిరి వజ్రం, లావూరి అరుణ సుధాకర్,వడ్డేపల్లి శ్రీనివాస,జన్నపాల సునీత కిరణ్,యర్రమళ్ళ దినేష్, మర్రి అంజిబాబు, తీరంశెట్టి సీతా కోటేశ్వర రావు, గంగుల బిక్షం యాదవ్,పిన్నబోయిన శ్రీనివాస యాదవ్, పశ్యా శ్రీనివాస రెడ్డి,ఎండి.షోయబ్,ఆయిల్ శ్రీను,మన్నెం శ్రీనివాస రెడ్డి,పెరుమాళ్ళ ధనమ్మ,బంటు నాగయ్య, రామావత్ భీమ్ల నాయక్,షేక్ ఖలీల్,నక్క సంధ్య,నేరెళ్ళ రవి,నేరెళ్ళ శివ,చిట్టిపోలు వెంకటేశ్వర్లు, చిమట వెంకటరాములు,భూక్యా రాంబాబు,ఆయిల వెంకన్న,ఎనుగంటి తిరుపతి నాయుడు,కంచి సత్యనారాయణ,ఈశ్వర్ చారి, గంట శ్రావణ్ రెడ్డి,పందిరి వేణు,నాగరాజు నరబోయిన,బంటు దుర్గయ్య, లోహిత్,ఖలీల్,నునే రవి,కనకయ్య,దైద వెంకటేష్, వల్లపట్ల వినోద్, షేక్ మస్తాన్, ఖలీల్,ఎక్క మనిదీప్,నర్ర ముఖేష్చౌదరి, నక్క సందీప్,వీణ.గయాస్,అలీం రుక్షాన, సుదీర్, చిత్రం ఉమా తదితరులు ఉన్నారు.

శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బత్తులలక్ష్మారెడ్డి.



మిర్యాలగూడ నవంబర్ 5 (ప్రజా న్యూస్ నెట్వర్క్ పి వెంకటయ్య)

మిర్యాలగూడలో లిశ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను మాజీ మున్సిపల్ చైర్మన్ తిరునగర్ భార్గవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి , మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి చిలుకూరి సుధ బాలకృష్ణ ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూమిర్యాలగూడ వై జంక్షన్ నేటి నుండి హనుమాన్ జంక్షన్ నామకరణముతో ప్రజలకు అందుబాటులో రానున్న శ్రీశ్రీశ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి నూతన విగ్రహం ప్రతిష్టాపన ఈనెల 27, 28 ,29 తేదీల్లో జరిగే మహోత్సవానికి మిర్యాలగూడ చుట్టుపక్కల ప్రజలు, హనుమాన్ భక్తులు వివిధ మాలధార భక్తులు,పుర ప్రముఖులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతము చేయవలసిందిగా కోరుకుంటున్నాను. అంజనీపుత్ర హనుమాన్ కి జై నినాదాలతో నగర పుర ప్రముఖులతో హనుమాన్ భక్తులతో హనుమాన్ జంక్షన్ ప్రతిధ్వనించింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

కరసేవకుల త్యాగాలకు ఘన నివాళి

కోఠారీ సోదరుల స్మారకార్థం రక్తదాన శిబిరం..

35 మంది కార్యకర్తల రక్తదానం



చాటుప్పల్ నవంబర్ 05 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్) :

అయోధ్య శ్రీరామ జన్మభూమి కోసం జరిగిన కరసేవలో ప్రాణాలర్పించిన కోఠారీ సోదరుల త్యాగాలను స్మరించుకుంటూ విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ప్రఖండ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బజరంగ్‌దళ్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కొండ శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 35 మంది కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. కోఠారీ సోదరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చని, యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మండలంలోని ప్రతి గ్రామంలో బజరంగ్‌దళ్ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించారు. హిందూ ధర్మ పరిరక్షణతో పాటు సామాజిక ఐక్యత, సేవా కార్యక్రమాలే ధ్యేయంగా ముందుకు సాగాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంయోజక్ గోగు రవితో పాటు వివిధ ప్రఖండాలకు చెందిన బజరంగ్‌దళ్ కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆందోల్ వీరనారి రాణి శంకరమ్మ చరిత్ర ఆందోల్ వీర రాణి శంకరమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలి

(తెలంగాణ గర్వకారణం ఆందోల్ సంస్థానాన్ని పాలించిన ధీరవనిత రాణి శంకరమ్మ)







(ప్రజా న్యూస్ నవంబర్ 5 ఆందోల్ ప్రతినిధి మహమ్మద్ ఆబేద్)

తెలంగాణ చరిత్రలో ఆందోల్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఒకప్పుడు ఆందోల్ సంస్థానాన్ని పరిపాలించిన వీరనారి రాణి శంకరమ్మ ధైర్యసాహసాలకు, ప్రజాపాలనకు ప్రసిద్ధి చెందారు. 1702లో గౌడిచెర్లలో జన్మించిన శంకరమ్మ, ఆందోల్ సంస్థానాధీశుడు నరసింహారెడ్డిని వివాహం చేసుకున్నారు. భర్త మరణానంతరం సంస్థాన పాలనా బాధ్యతలు చేపట్టి ప్రజల సంక్షేమానికి కృషి చేశారు. ఆమె పరిపాలనా ప్రతిభకు, ధైర్యసాహసాలకు గుర్తింపుగా నిజాం పాలకుడు 'రాయభాగిన్' అనే బిరుదుతో సత్కరించినట్లు చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి. ఆమె పేరుతో శంకరంపేట, తల్లిదండ్రుల పేర్లతో సంగారెడ్డి, రాజంపేట వంటి ప్రాంతాల పేర్లు ఏర్పడినట్లు చరిత్రలో ప్రస్తావన ఉంది. ఆందోల్ కోట, బురుజులు నాటి వైభవానికి గుర్తులుగా నిలిచాయి.

హెచ్ఎంటీ నగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

హైదరాబాద్ ఉప్పల్ ప్రతినిధి కె శివ కుమార్ నవంబర్ 05 (ప్రజా న్యూస్ నెట్‌వర్క్): హెచ్ఎంటీ నగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వేద పండితులు మరియు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నీ ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

ఎన్నికల విధుల్లో టీచర్ మృతి..

చంద్రబాబు, నారా లోకేశ్ తీవ్ర విచారం



ఆంధ్రప్రదేశ్‌లో నేడు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల విధుల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అనంతపురం జిల్లాలో పోలింగ్ అధికారిణిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఓ ఉపాధ్యాయురాలు అకస్మాత్తుగా మరణించారు. ఈ ఘటన గురువారం కూడేరు మండలంలో జరిగింది. వివరాల్లోకి వెళితే, కూడేరు మండలం కాడదారకుంట గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా (ఏపీఓ) హరిత గౌడ్ (58) విధుల్లో ఉన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ జరుగుతుండగా ఆమె తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతూ పోలింగ్ కేంద్రంలోనే కుప్పకూలిపోయారు. వెంటనే అప్రమత్తమైన అక్కడి వైద్య సిబ్బంది ఆమెను కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. గుండెపోటు రావడంతో మధ్యాహ్నం సుమారు 12:50 గంటలకు ఆమె తుదిశ్వాస విడిచినట్లు అధికారులు తెలిపారు.మృతురాలు హరిత, డి.హిరేహాళ్ మండలం పూలకుర్తి గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా (ఎస్జీటీ) పనిచేస్తున్నారు. ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయురాలు మరణించడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హరిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం తరపున బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అదేవిధంగా, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. "అనంతపురం జిల్లా కూడేరు మండలం కాడదారకుంటలో ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న టీచర్ హరిత గౌడ్ గారు గుండెపోటుతో కన్నుమూయడం చాలా బాధాకరం. అస్వస్థతకు గురైన వెంటనే అత్యవసర వైద్యం అందించినా ఫలితం లేక మృతి చెందడం ఈ విషాదం నెలకొంది. వారికి నివాళులు అర్పిస్తున్నాను. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అంటూ సోషల్ మీడియాలో స్పందించారు.

ఓటు వేయని జగన్‌కు ఎన్నికలపై మాట్లాడే నైతిక హక్కు లేదు : ధూళిపాళ్ల నరేంద్ర



ఓటు హక్కు వినియోగించుకోని జగన్ కు ఎన్నికల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తీవ్రంగా విమర్శించారు. ప్రజా తీర్పును గౌరవించడం జగన్ డీఎన్ఏలోనే లేదని, ఆయన మాటల్లో ఆత్మస్తుతి, పరనింద తప్ప మరేమీ కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో జగన్ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా బదులిచ్చారు."ప్రజాస్వామ్యంలో ఓటు అనేది అత్యంత పవిత్రమైనది. పేదవాడి నుంచి రాష్ట్రపతి వరకు అందరికీ ఓటు ఉంటుంది. కానీ, బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో వచ్చి, పోలింగ్ బూత్ దగ్గరకు వెళ్లి ఓటు వేయకుండా వెనక్కి వచ్చిన ఏకైక రాజకీయ నాయకుడు జగన్. ఇది ప్రజాస్వామ్యం పట్ల, ప్రజల ఓటు పట్ల ఆయనకు ఉన్న చిన్నచూపును స్పష్టం చేస్తోంది. ఓటు వేయని నాయకుడిగా జగన్ చరిత్రలో నిలిచిపోతారు" అని ధూళిపాళ్ల అన్నారు.2024 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును గౌరవించకుండా, ఈవీఎంల వల్లే కూటమి గెలిచిందని జగన్ ప్రచారం చేశారని, ఇప్పుడు బ్యాలెట్ పద్ధతిలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఓటమి తర్వాత అదే పంథాను అనుసరిస్తున్నారని విమర్శించారు. "అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలు జరిగితే అద్భుతం అన్నారు. ఇప్పుడు అదే జరిగితే దౌర్జన్యం అంటున్నారు. ఇది ద్వంద్వ నీతి కాదా?" అని ఆయన ప్రశ్నించారు. వారి హయాంలో స్టేట్ ఎలక్షన్ కమిషన్‌ను నిర్వీర్యం చేశారని, నాటి కమిషనర్ ప్రాణభయంతో కేంద్రానికి లేఖ రాసిన విషయాన్ని జగన్ గుర్తుంచుకోవాలని హితవు పలికారు.ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ భారీ సంఖ్యలో నామినేషన్లు వేసిందని, వాస్తవాలను కప్పిపుచ్చి ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తోందని నరేంద్ర కుమార్ అన్నారు. "ఎంపీటీసీ స్థానాల్లో 17,726, జెడ్పీటీసీల్లో 1,445, కార్పొరేషన్లలో 367 చోట్ల మీ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. పోలీసులే మీకు రక్షణగా ఉండి నామినేషన్లు వేయించారు. నిజంగా ప్రభుత్వం రిగ్గింగ్ చేసి ఉంటే, మీ పార్టీకి చెందిన ఒక మేయర్ సహా నలుగురు అభ్యర్థులు ఎలా గెలిచారు?" అని నిలదీశారు.ఎన్నికలను అడ్డుకోవడానికి డీలిమిటేషన్, బీసీ రిజర్వేషన్లపై వైసీపీ 61 కేసులు వేసిందని, అయినా సుప్రీంకోర్టు ప్రజాక్షేత్రంలో తేల్చుకోమని చెప్పడంతో ఎన్నికలు పారదర్శకంగా జరిగాయని వివరించారు. "వైసీపీ నమ్ముకున్నది విధ్వంసాన్ని. మేము నమ్ముకున్నది ప్రజలను, అభివృద్ధిని, సంక్షేమాన్ని. రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేసిన పనులను చూసే ప్రజలు స్థానిక ఎన్నికల్లోనూ వైసీపీని నాలుగు స్థానాలకే పరిమితం చేశారు" అని తెలిపారు. 2024లో ప్రజలిచ్చిన షాక్ ట్రీట్‌మెంట్‌ను మరోసారి స్థానిక ఎన్నికల్లో ఇచ్చారని, ఓటమిని జీర్ణించుకోలేక వైసీపీ నేతలు నిరాశతో మాట్లాడుతున్నారని అన్నారు.అసెంబ్లీకి రాకుండా, అప్పుడప్పుడు వచ్చి ప్రభుత్వంపై బురద చల్లి వెళ్లే ధోరణిని జగన్ మానుకోవాలని ధూళిపాళ్ల సూచించారు. ప్రజాతీర్పును గౌరవించి, ప్రజా సమస్యలపై పోరాడాలని, అనవసరమైన ఆరోపణలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయవద్దని ఆయన హితవు పలికారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

థార్ గ్యాంగ్‌ల సంచార సమాచారంతో మఠంపల్లి పోలీసులు అప్రమత్తం!

– సాగర్, ఎన్‌సీఎల్ సిమెంట్ ఫ్యాక్టరీల వద్ద ప్రత్యేక అవగాహన సమావేశాలు
– దొంగతనాల నివారణకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి: ఎస్ఐ ప్రవీణ్ కుమార్

మఠంపల్లి మండలం, నవంబర్ 5, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్ :

థార్ గ్యాంగ్ సూర్యాపేట జిల్లాలో సంచరిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పై అధికారుల ఆదేశాలతో మఠంపల్లి పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా మఠంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ కాలనీ, ఎన్‌సీఎల్ సిమెంట్ ఫ్యాక్టరీ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో కాలనీవాసులు, ఫ్యాక్టరీ యాజమాన్య ప్రతినిధులు, సెక్యూరిటీ సిబ్బందికి దొంగతనాల నివారణ, వ్యక్తిగత భద్రత, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్ఐ బి. ప్రవీణ్ కుమార్ వివరించారు. కాలనీలు, ఫ్యాక్టరీ పరిసరాల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రధాన ప్రవేశ మార్గాలు, కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని నిరంతరం పనిచేసేలా చూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో భద్రతా సిబ్బంది నిఘాను మరింత పెంచాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా అనుమానాస్పద కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని తెలిపారు. పరిచయం లేని వ్యక్తులు ప్రాంతాల్లోకి వచ్చినా, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనా వెంటనే స్థానిక పోలీసులకు లేదా అత్యవసర సహాయం కోసం 112 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ఏదైనా ఘటన జరిగే వరకు వేచి చూడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా దొంగతనాలను అరికట్టవచ్చని వివరించారు. ప్రజలు, ఫ్యాక్టరీ యాజమాన్యాలు, భద్రతా సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ పోలీసులకు సహకరించాలని, గ్రామాలు, కాలనీలు, పరిశ్రమల పరిసరాల్లో శాంతిభద్రతలు మరియు ప్రజల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఎస్ఐ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు.





జ్యోతిరావు ఫూలే ఇందిరమ్మ ఇళ్ల కాలనీ ప్రారంభోత్సవ మహోత్సవానికి ఆత్మీయ ఆహ్వానం





మిర్యాలగూడ నవంబర్ 5(ప్రజా న్యూస్ నెట్వర్క్ పి వెంకటయ్య)

మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి సమక్షంలో, మిర్యాలగూడ మండల పరిధిలోని వెంకటాద్రిపాలెం సమీపంలో నూతనంగా నిర్మించిన లి560 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లతో కూడిన "జ్యోతిరావు ఫూలే ఇందిరమ్మ ఇళ్ల కాలనీ" ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడుతోంది...

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్న గౌరవనీయ మంత్రివర్యులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఇళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడుతుంది...

ముఖ్య అతిథులుగా

– లిఅడ్లూరి లక్ష్మణ్ కుమార్
నల్గొండ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రివర్యులు

– నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి
రాష్ట్ర నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు

– కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు

– పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
రాష్ట్ర రెవెన్యూ మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు

– వేముల వీరేశం
ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు

– కుందూరు రఘువీర్ రెడ్డి
నల్గొండ పార్లమెంట్ సభ్యులు

– కేతావత్ శంకర్ నాయక్
శాసనమండలి సభ్యులు

కార్యక్రమ వివరాలు

తేదీ: 06 నవంబర్ 2026, శుక్రవారం
సమయం: సాయంత్రం 5:00 గంటలకు
– వేదిక: జ్యోతిరావు ఫూలే ఇందిరమ్మ ఇళ్ల కాలనీ, వెంకటాద్రిపాలెం సమీపం, మిర్యాలగూడ మండలం...

కావున మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు మరియు బి ఎల్ ఆర్ బ్రదర్స్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నాము.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు అనేక ఆదర్శవంతమైన కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా స్థానిక మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల....

విశాఖపట్నం, నవంబర్ 05: ప్రజా న్యూస్ నెట్వర్క్ విశాఖపట్నం స్టాప్ రిపోర్టర్, పీ.ఎం.నాయుడు.

"సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ఛాంపియన్" గా గత రెండు సంవత్సరాలుగా ప్రశంసా పత్రాలను పొందింది. ఈ సంవత్సరం మరింత మెరుగైన కార్యక్రమాలను చేపట్టడం ద్వారా ఒక ఆదర్శవంతమైన విద్యాసంస్థగా పలు ఇతర విద్యా సంస్థలకు మార్గదర్శకంగా నిలుస్తోంది. 20 అంశాలలో 100 కార్యక్రమాలను పూర్తి చేసి,సామాజిక-సేవా కార్యక్రమాలలో మేటి సంస్థగా ప్రశంసలు అందుకుంటోంది. అనుభవ ఆధారిత విద్యకు,విద్యార్థినుల నూతన ఆవిష్కరణలకు, వారిలో సామాజిక సేవ, నాయకత్వం, బాధ్యతాయుత ప్రవర్తన,విలువల పట్ల నిబద్ధత పెంపొందడానికి కళాశాల ప్రాంగణంలో అనేక సదస్సులను, శిక్షణలను ఏర్పాటు చేశారు.వివిధ పుస్తకాలను సమీక్షించడం, భారత రాజ్యాంగం పట్ల అవగాహన కలిగించడం, పర్యావరణహిత వస్తువులైన జ్యూట్ బ్యాగులు మొదలైన వాటిని తయారు చేయడం, చేతివృత్తులలో శిక్షణ, కళాశాల ప్రాంగణంలోని చెట్లకు జియో ట్యాగ్ ఇవ్వడం,ప్రాథమిక చికిత్స-అగ్ని ప్రమాదాలను ఎదుర్కోవడం మొదలైన అంశాలతో కూడిన విపత్తుల నిర్వహణ కార్యక్రమం, మురికివాడలలోని ప్రజల సమస్యలను తెలుసుకుని,వాటికి పరిష్కారాలను సూచించడం, సంబంధిత అధికారులకు ప్రజల తరఫున పిటీషన్లను అందివ్వడం మొదలైన అనేక కార్యక్రమాలను ఈ సెప్టెంబర్ మరియు అక్టోబర్ నెలలలో కళాశాలలో చేపట్టారు. ఈ కార్యక్రమాలకు సిస్టర్ క్యాస్లిన్ సారధ్యం వహించగా, సీనియర్ అధ్యాపకులు వై. అననూయదేవి,షేక్ వలీషా సమన్వయకర్తలుగా వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో 20 మంది అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరందరినీ సెయింట్



ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి,జాతీయ సేవా పథకం జిల్లానోడల్ అధికారి ఇపిఎస్ భాగ్యలక్ష్మి అభినందించారు.